క్లుప్తంగా

వేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు



నెల్లూరు(బృందావనం): నెల్లూరు మండల వేద పరిషత్ ఆధ్వర్యంలో 77వ వార్షిక సమావేశం పోలీస్ కాలనీలోని వేదపండితుడు అవ్వారి రామకృష్ణశర్మ నివాసంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపారాయణం చేశారు. వేద విద్యను అభ్యసించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు జయపత్రికలు(సర్టిఫికెట్లు), ప్రోత్సాహక నగదును విష్ణుభొట్ల కృష్ణ, రావూరి మల్లికార్జున, ఎనమండ్ర నాగదేవిప్రసాద్, మాచవోలు భాస్కర్, రామశాస్త్రి, ప్రసాద్, శివకుమార్ అందజేసి సత్కరించారు.

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా రేపు

నెల్లూరు(బృందావనం): ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం మేరకు ఈనెల 15న ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నాను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ రఘునాథ్ ఆదివారం తెలిపారు. తమ సమస్యల సాధన కోసం ధర్నా చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆగస్టు 31న సామూహిక నిమజ్జనోత్సవం

నెల్లూరు(బృందావనం): ట్రంకురోడ్డు గాంధీ బొమ్మ దగ్గర ఉన్న టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆగస్టు 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలు ఆగస్టు 31న పూర్తి చేసి సామూహిక నిమజ్జనోత్సవం నిర్వహించాలని ఉత్సవ సమితి పిలుపునిచ్చింది. తాత్కాలిక వినాయక మండపాల నిర్వహణపై ఈనెల 20న సమావేశం జరుగుతుందన్నారు. స్వర్ణాల చెరువులో గణేష్ ఘాట్ వద్ద నిమజ్జనోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిట్టి సత్యనాగేశ్వరరావు, పి.సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు భువనేశ్వరిప్రసాద్, కప్పిర శ్రీనివాసులు, మండల ఈశ్వరయ్య, కోశాధికారి ఏవీఆర్ మోహన్‌రావు, కేవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

- అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

నెల్లూరు(బారకాసు): హోటల్స్, రెస్టారెంట్ల యాజమాన్యం పరిశుభ్రత, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాల్లో తప్పక నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పలు హోటల్స్‌లో ఆహార పదార్థాల్లో బల్లులు, బొద్దింకలు, క్రిమి కీటకాలున్నట్లుగా సోషల్ మీడియాలో వస్తున్న పలు ఘటనలపై స్పందిస్తూ ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజు వ్యాపారం ముగిసిన తర్వాత వంటగది, డైనింగ్ ఏరియా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒకసారి పెస్ట్ కంట్రోల్ చేయించాలని తెలియజేశారు. ఈగలు, ఎలుకలు, పురుగులు వంటశాలలో లేకుండా చూసుకోవాలని సూచించారు. తాగేందుకు, ఆహార పదార్థాల తయారీలో మంచినీటినే వాడాలన్నారు. వంటశాల ప్రదేశం నేల, గోడలు, పైకప్పులు శుభ్రంగా, హైజీనిక్‌గా ఉండాలని తెలిపారు. నీరు నిల్వ లేకుండా డ్రెయినేజీ సదుపాయం సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, చేతులకు గ్లౌజ్‌లు, తలకు, మూతికి మాస్కులు ధరించాలన్నారు. వినియోగదారులు ఫిర్యాదులు చేసేందుకు హోటల్‌లో ప్రత్యేకంగా కంప్లెయింట్ బుక్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆహార పదార్థాల విషయంలో వినియోగదారులకు ఇబ్బందుల ఎదురైతే నగరంలోని చంద్రమౌళినగర్‌లో ఉన్న ఫుడ్ కంట్రోల్ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

విద్యతోనే ఉన్నతి

నెల్లూరు(బృందావనం): విద్యతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు, ఉన్నతి ఉంటుందని రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి తెలిపారు. బట్వాడిపాళెంలోని శాంతినగర్ నిర్మల సౌధలో రెడ్ల ఐక్యవేదిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీకేడబ్ల్యూ కళాశాలలో ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని పిచ్చల అనిత (958/1000)కు ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందజేశారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ ఐక్య వేదిక కార్యవర్గ సభ్యురాలు కవితరెడ్డి, అధ్యాపకుడు సుబ్బారెడ్డి, వెందోటి సుబ్బారెడ్డి విద్యార్థినికి రూ.10 వేలను చెక్కు రూపంలో అందజేశారన్నారు. అలాగే డీకేడబ్ల్యూ కళాశాలలో మేడా హరినారాయణరెడ్డి 25, బొమ్మా సతీష్‌రెడ్డి 10, మోచర్ల సుధాకర్‌రెడ్డి 10, ఎద్దల రామచంద్రారెడ్డి ఐదు బల్లలకు అందించారన్నారు. అలాగే జూలై నెలలో జన్మదినం జరుపుకుంటున్న కృపాకర్‌రెడ్డి, మేడా హరినారాయణరెడ్డి, కల్లూరు రమణారెడ్డి, శ్యామల నరసింహారెడ్డి, అడ్వొకేట్ సుజనారెడ్డిలతో కేక్ కటింగ్ చేయించారు.

బాబోయ్.. దోమలు

- లోపిస్తున్న పారిశుధ్యం
- డెంగీ, మలేరియాతో భయం
- రాత్రివేళ జాగారం
- చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి



పొదలకూరు: పల్లెలు, పట్టణంలో దోమల మోత ఎక్కువైంది. రాత్రివేళ దోమల తాకిడిని తట్టుకోలేక జాగారం చేస్తున్నారు. దోమకాటుతో డెంగీ, మలేరియా జ్వరాలొస్తాయని భయపడుతున్నారు. ప్రధానంగా పారిశుధ్య లోపంతో ఇవి వ్యాప్తి చెందుతున్నాయి. కాలువల్లో పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లకపోవడం సైతం సమస్యకు ఓ కారణమవుతోంది. దోమలతో వచ్చే వ్యాధులపై ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారే తప్ప, వాటిని అదుపు చేసే దిశగా చర్యలు చేపట్టడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పేడదిబ్బలు, పేరుకుపోయిన మురుగుతో ఇవి ఎక్కువవుతున్నాయి. పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని 30 పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపడితే సమస్య తగ్గేందుకు అవకాశం ఉంది.

కొన్ని రోజులుగా సమస్య తీవ్రం

కొద్ది రోజులుగా దోమల ఉధృతి అధికంగా ఉంది. ఆరుబయట నిద్రించే వారు దోమ తెరలను ఉపయోగించాలని ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు. అయితే చాలా మంది వీటిని వినియోగించడంలేదు. దీంతో కీటకాల నుంచి వ్యాప్తి చెందే జ్వరాలొస్తున్నాయి. ఇంట్లో పడుకుంటే ఉక్కపోత.. బయట నిద్రిస్తే దోమల మోతతో అల్లాడిపోతున్నారు. ఫాగింగ్ చేసి సమస్యను పరిష్కరించాలని అభ్యర్థిస్తున్నారు.

పందుల స్వైర విహారం

పందుల స్వైర విహారంతో అపరిశుభ్రత ఏర్పడి దోమలు పెరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారాల వద్ద పందులు తిష్ట వేస్తుండటంతో అపరిశుభ్రత నెలకొంటోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



వసతిగృహంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యాధికారులు, సిబ్బంది



కాలువలో పందులు

ప్రసన్నకు పలువురి పరామర్శ



విడవలూరు తీరప్రాంత మహిళలతో ప్రసన్న

కోవూరు: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ మూకలు దాడి జరిపిన నేపథ్యంలో కోవూరు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు నెల్లూరులోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శిస్తున్నారు. ఈ క్రమంలో విడవలూరు మండలంలోని తీర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ఆదివారం ప్రసన్నను కలిసి పరామర్శించారు. ప్రసన్నకు న్యాయం జరగాలని వారు డిమాండ్ చేశారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ముత్తుకూరు(పొదలకూరు): పట్టణంలోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో 2007 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. స్మృతులను నెమరేసుకున్నారు.

స్థాయి మరచి మాట్లాడొద్దు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉదయభాస్కర్

కొడవలూరు: యల్లాయపాళెం ఎంపీటీసీ సభ్యుడు, రౌడీషీటర్‌గా ఉన్న గరికపాటి రాజేంద్ర తన స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అనపల్లి ఉదయభాస్కర్ హితవు పలికారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రౌడీషీటర్‌గా ఉన్న రాజేంద్ర పేకాట నిర్వహణే ప్రధాన వృత్తిగా ఉంటారన్నారు. ఇలాంటి వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రులపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వివాదరహిత నియోజకవర్గంగా మారుస్తానని ప్రకటనలు గుప్పిస్తుంటారని, కానీ చోటా నాయకులను మాత్రం ప్రెస్‌మీట్‌లు పెట్టి విమర్శించాలని ప్రోత్సహిస్తుంటారన్నారు. విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం రాజకీయ నేతల లక్షణమని, అయితే ఇళ్లపై దాడులు చేయించడం ఎక్కడి సంస్కృతో అర్థం కావడం లేదన్నారు. మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేయించడం రౌడీయిజం కాదా అని ప్రశ్నించారు. ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో ఇప్పటివరకు దాడుల సంస్కృతి లేదని, ప్రశాంతమ్మ ఎమ్మెల్యే అయ్యాకే గూండాగిరికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికైనా టీడీపీ చోటా నేతలు ఇష్టానుసారం నోరు పారేసుకోకుండా అదుపు చేయాలని స్థానిక ఎమ్మెల్యేకు సూచించారు. సమావేశంలో సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎం.రమేష్, ఎస్సీ సెల్ నాయకులు చిరంజీవి, పెంచలయ్య, టి.భాస్కర్, టి.అహరోన్, చందు, సంపూర్ణ, రవికుమార్, సుబ్బరాయుడు, రమణయ్య, హరి, మనోజ్, జి.సునీల్, రాఘవ, మధు పాల్గొన్నారు.

డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా వెంకీ



కొడవలూరు: డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా కొడవలూరుకు చెందిన కోవూరు వెంకీ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు వెంకీ ఆదివారం తెలిపారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



పొదలకూరు: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీనివాసుని కల్యాణాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని జరిపారు. మహిళా భక్తులకు ముత్యాల తలంబ్రాలను అందజేశారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

పొదలకూరు: విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని ఆల్తుర్తి - నావూరుపల్లి మార్గంలో గల వాగు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. నావూరుపల్లికి చెందిన బాధిత పాడి రైతు చినపెంచలయ్య వివరాల మేరకు.. ముర్రాజాతికి చెందిన నాలుగు గేదెలు మేత కోసం ఆల్తుర్తి వాగు వద్దకెళ్లాయి. వనంతోపులో దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి అనధికారికంగా విద్యుత్ కనెక్షన్ పొంది వాగు సమీపంలో వరిసాగు చేస్తున్నారు. ఈ క్రమంలో తీగలు తగిలి మృత్యువాత పడ్డాయి.

పొదలకూరులో ట్రాఫికర్



నిలిచిపోయిన వాహనాలు

- నానాటికీ తీవ్రమవుతున్న సమస్య
- బారులుదీరుతున్న వాహనాలు

పొదలకూరు: పట్టణంలో ట్రాఫిక్ నానాటికీ పెరిగిపోతోంది. ఇటీవల వాహనాల రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణానికి చుట్టుపక్కల ఉన్న మండలాల వాసులు నెల్లూరు నగరానికి వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేదు. దీంతో పట్టణం మీదుగానే వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు పెరుగుతున్నాయి. దీనికి తోడు ఆటోలు, కంకర లారీల తాకిడి అధికంగా ఉంది. ఆటోల డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడే నిలిపేస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సుమారు అరగంట సేపు నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బస్టాండ్, రామనగర్ గేట్, బ్యాంకుల సెంటర్లలో సమస్య తీవ్రంగా ఉంది. ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుళ్లను నియమించకపోవడంతో వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తున్నాయి.

వేడుకగా అంకమ్మతల్లి గ్రామోత్సవం



మనుబోలు: మనుబోలు తూర్పు వీధిలో కొలువైన అంకమ్మతల్లి గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పుట్ట మట్టిని తీసుకొచ్చి అమ్మవారిని తయారు చేసి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంకమ్మ, పోలేరమ్మకు గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం అంకమ్మతల్లిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. డీజే, తప్పెట్లు, మంగళవాయిద్యాలు ఆకట్టుకున్నాయి. బాణసంచా పేలుస్తూ కేరింతలు కొట్టారు.

కామాక్షితాయికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోవూరు ఆర్యవైశ్య భక్త బృందం ఆధ్వర్యంలో జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారికి ఆషాడమాస సారెను ఆదివారం సమర్పించారు. 30 మంది మహిళలు భక్తిశ్రద్ధలతో సారె అందించి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ వెంకట శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా ఇరుకళల పరమేశ్వరి







ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో శాకంబరి అలంకారంలో ఉత్సవమూర్తులు

ఆషాడమాసాన్ని పురస్కరించుకుని సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత మూలవర్లకు శాస్త్రోక్తంగా అభిషేకం గావించారు. తదుపరి అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. విశేషాలంకారంలో కొలువైన మూలవర్లు, ఉత్సవమూర్తులను భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. సద్ది, పొంగళ్ల నివేదనతో పాటు చిన్నతీర్థం, పెద్దతీర్థం, సాత్వికబలి, కూష్మాండబలులతో బోనాలు సమర్పించి ప్రణమిల్లారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బాలాజీనగర్‌లోని రాజరాజేశ్వరి అమ్మవారి భక్తమండలికి చెందిన మహిళా భక్తులు లలితాసహస్రనామ పారాయణం చేశారు. కోటేశ్వరమ్మ బృందం ఆధ్వర్యంలో కోలాటాలు ప్రదర్శించారు. దేవస్థానం ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

– నెల్లూరు (బృందావనం)



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులు



కాయగూరలతో శోభిల్లుతున్న ఆలయం



మహిళల కోలాట ప్రదర్శన